క్లుప్తంగా

శ్రీవారికి బిల్వ దళార్చన



బిల్వదళాలతో ప్రసన్న వెంకటేశ్వరుడు

అక్కిరెడ్డిపాలెం: ప్రసన్న వేంకటేశ్వరస్వామికి శనివారం బిల్వ దళార్చన నిర్వహించారు. శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ గంధ్రెడ్డి రాము నాయుడు, సభ్యులు పాల్గొన్నారు.

ట్రావెల్ బస్సుల తనిఖీ



షీలానగర్ వద్ద బస్సులు తనిఖీ చేస్తున్న ఎంవీఐ రాజారావు

అక్కిరెడ్డిపాలెం: సంక్రాంతి పండగ నేపథ్యంలో మోటార్ వెహికల్ అధికారులు ట్రావెల్ బస్సుల తనిఖీలు నిర్వహిస్తున్నారు. శనివారం షీలానగర్ సిగ్నల్ పాయింట్ వద్ద మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజారావు సిబ్బందితో కలిసి విజయవాడ–విశాఖపట్నం, హైదరాబాదు–విశాఖపట్నంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే వివిద సంస్థల ట్రావెల్ బస్సులను తనిఖీ చేశారు. అదనపు చార్జీలు, పరిమితికి మించి లోడ్లు వంటి వాటిపై తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎటువంటి కేసులు నమోదు చేయలేదని పేర్కొన్నారు.

ఘనంగా ధనుర్మాస పూజలు

గోదాదేవి కల్యాణానికి ఏర్పాట్లు



పూజల్లో పాల్గొన్న భక్తులు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి శాంతినగర్ కాలనీలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు కనులపండువగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా భక్తులు 29వ పాశురం చదివి వినిపించారు. పాశుర విశిష్టతను ఆలయ అర్చకులు వివరించారు. ముందుగా ఆలయ ధర్మకర్త ఈ.కె.చారి దంపతులు పూజలు చేశారు. అగనంపూడి పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొని, విశేష పూజలు చేశారు.

ముగిసిన గురు పూజోత్సవాలు

మహారాణిపేట: ఆధునిక యుగంలో రకరకాల సమస్యలతో సతమతమవుతున్న మానవాళికి పరిష్కార మార్గమొక్కటే శరణ్యమని.. అలాంటి మార్గం పరమ గురువుల బోధనల్లో లభిస్తుందని ఆదాయ పన్నుల శాఖ కమిషనర్ బి.ఎస్.ఎస్.రాజు(కోల్‌కతా) అన్నారు. జిల్లా పరిషత్ సమీపంలోని అంకోశా ఫంక్షన్ హాలులో శనివారం జగద్గురు పీఠం నిర్వహించిన 63వ మాస్టర్ సీవీవీ గురుపూజోత్సవాల ముగింపు సభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. శ్రీ రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, మాస్టర్ పార్వతీకుమార్ బోధనలతో తాను ప్రభావితం చెందానన్నారు. అనంతరం పార్వతీకుమార్ రాసిన మెర్రీ లైఫ్ డే అనే ఆంగ్ల పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. జగద్గురు పీఠం కార్యదర్శి బి.ఆర్.కె.రాజు 'శంబళ' అనే మరో పుస్తకాన్ని ఆవిష్కరించారు. సంస్థ సలహామండలి సభ్యుడు కె.ఎస్.ఆర్.గోపాల్ (హైదరాబాద్) 'విష్ణు సహస్రనామ' ప్రసంగాల రెండవ సంపుటిని విడుదల చేశారు. ధనిష్టా ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కె.గురుప్రసాద్ మాట్లాడుతూ విదేశాల్లో మత సంస్థ చేపడుతున్న జ్ఞానయజ్ఞం, రామనామ యజ్ఞ కార్యక్రమాలను వివరించారు. బెంగళూరుకు చెందిన కె.రవి, ఖరగ్‌పూర్‌కు చెందిన జి.వి.కృష్ణమోహన్ తమ అనుభవాలను వివరించారు. 'నావాణి 'దర్శన మాసపత్రికపై సమీక్ష జరిపారు. జగద్గురుపీఠం వివిధ కేంద్రాల నుంచి రెండు వేలమందికి పైగా సాధకులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు.

శబరిమలను తలపించేలా..

- ఉక్కు అయ్యప్ప ఆలయం
- రేపు జ్యోతి దర్శనం



విద్యుత్ అలంకరణలో స్టీల్‌ప్లాంట్‌లోని అయ్యప్ప ఆలయం



ప్రత్యేక అలంకరణలో అయ్యప్ప స్వామి

ఉక్కునగరం: హరిహర సుతుడు అయ్యప్పస్వామి ఆలయాల్లో ఉక్కునగరంలోని ఆలయం ఎంతో ప్రత్యేకం. శబరిమలైలోని అయ్యప్ప ఆలయం డిజైన్‌తో నిర్మించిన ఈ దేవాలయంలో అష్టాదశ దేవతలు (18 మెట్లు), ఉప దేవతలు, బలి పీఠాలకు, పరివార దేవతలకు చెందిన ఉప ఆలయాలు భక్తులను ఆనందపరవశులను చేస్తాయి. ముఖ్యంగా శబరిమలై ఆలయం వెనుక ఉన్నట్లే ఈ ఆలయం వెనుక కూడా పొన్నాంబలై కొండ ఉండటం మరో ప్రత్యేకత.

స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఉక్కు స్టేడియం ఎదురుగా కేటాయించిన స్థలంలో భక్తులు, దాతల విరాళాలతో ఆధునికంగా అయ్యప్ప ఆలయాన్ని నిర్మించారు. ఆలయంలో నిత్య పూజలు, ఉత్తరా నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు జరుగుతుంటాయి. ప్రతీ ఏటా నవంబర్ 16 నుంచి డిసెంబర్ 27 వరకు 41 రోజుల పాటు అయ్యప్ప మండల పూజలు నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా మండల దర్శనం ముందు శబరిమలై అయ్యప్ప ఆలయంలో నిర్వహించే పడిపూజను భారీస్థాయిలో నిర్వహిస్తుంటారు. ఉత్తరాంధ్రలోని అన్ని జిల్లాల నుంచి మాలధారులు వేల సంఖ్యలో ఇక్కడి పడిపూజకు హాజరవుతారు. గత నాలుగేళ్లుగా మండల పూజలో పాల్గొనే స్వాములకు ఉచిత అన్నదానం నిర్వహిస్తున్నారు.

ప్రతీ ఏటా ఉత్తరా నక్షత్రం నాడు అయ్యప్ప జన్మదినోత్సవా ఘనంగా నిర్వహిస్తుంటారు. మకర సంక్రాంతి నాడు ఆలయం వెనుక ఉన్న పొన్నాంబలై కొండపై జ్యోతి కనిపించడం కూడా ప్రత్యేక విశేషంగా భక్తుల అభివర్ణిస్తుంటారు.



పూజలో అయ్యప్ప భక్తులు

20 ఏళ్లుగా మాలధారణ

గత 20 ఏళ్లుగా అయ్యప్ప మాల ధరిస్తున్నాను. ఇందులో చాలాసార్లు జ్యోతి దర్శనానికి వెళ్లగా మిగిలిన సార్లు మండల దర్శనానికి వెళ్లాను. మాలధారణతో క్రమశిక్షణ పెరిగింది. మొదట్లో ఉన్న కోపం పూర్తిగా తగ్గిపోయింది. చెడు అలవాట్లకు దూరం అయ్యాను. చాలాసార్లు ఎవరి వల్ల కాని పనులు స్వామి లీల వల్ల జరిగాయి. దాంతో తీవ్రమైన అనుభూతి పొందాను.

– ఉప్పల వెంకట కిషోర్, గురుస్వామి

ప్రశాంత జీవనం

ఇప్పటి వరకు చాలాసార్లు మాల వేశాను. నడిచి జ్యోతికి వెళ్లాను. అనేక సార్లు మండలానికి వెళ్లాను. లేని దాని కోసం ఆలోచించకుండా ఉన్నదానితో తృప్తి పడుతున్నాను. ప్రశాంతంగా జీవితం గడుస్తుంది. స్వామి దయ వల్ల నా కుటుంబం మంచి పరిస్థితిలో ఉంది.

– పెనుమర్తి బాలాజీ, స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి

మార్కెట్‌కు సంక్రాంతి శోభ



కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న గాజువాక మెయిన్ రోడ్డు

రద్దీగా రహదారులు

గాజువాక: గాజువాక సంక్రాంతి శోభను సంతరించుకుంది. షాపింగ్ మాల్స్, వస్త్ర దుకాణాల్లో ఇసుక వేస్తే రాలనంతగా రద్దీ నెలకొంది. కొత్త గాజువాక నుంచి పాత గాజువాక వరకు మెయిన్‌రోడ్డులోని ఫుట్‌పాత్ షాపుల్లో కూడా సంక్రాంతి షాపింగ్ పోటాపోటీగా సాగుతోంది. కొనుగోలుదార్లతో మార్కెట్లు కిటకిటలాడుతున్నాయి. సంక్రాంతి సమీపించడంతో రెండురోజులుగా వ్యాపారాలు ఊపందుకున్నాయి. దీంతో వ్యాపార సంస్థలు, వస్త్ర దుకాణాలు కళకళలాడుతున్నాయి. గాజువాకలో షోరూమ్‌లు, వివిధ వ్యాపార సంస్థలు బాగా విస్తరించడంతో అన్ని వస్తువులు ఇక్కడే లభ్యమవుతున్నాయి. వీటితో పాటు రోడ్డు వ్యాపారాలకు కూడా ఏమాత్రం ఆదరణ తగ్గలేదు. వ్యాపారులు కోల్‌కతా, చెన్నై, రాజస్థాన్, తిరుపూర్‌వంటి ప్రాంతాల నుంచి రెడీమేడ్ దుస్తులు తెచ్చి అమ్మకాలు సాగిస్తున్నారు. పలు వ్యాపార సంస్థలు స్టాక్ క్లియరెన్స్‌ల పేరిట ఆఫర్లను ప్రకటించడం ద్వారా వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నాయి. దీంతో ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయేవరకూ ఇసుకేస్తే రాలనంతగా జనాలతో రహదారుల్లో రద్దీ చోటుచేసుకుంటోంది. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు కోస్తా ప్రాంతంలోని పలు జిల్లాలకు చెందినవారు సంక్రాంతికి తమ ప్రాంతాలకు బయల్దేరనుండటంతో ఇక్కడే పండగ షాపింగ్ చేస్తున్నారు.



రద్దీగా ఉన్న పాత గాజువాక బస్ స్టాప్

కొండ దిగుతున్న కాలనీలు

సంక్రాంతికి గాజువాకలోని కొండవాలు ప్రాంతాలకు చెందిన కాలనీల నివాసులు ఎక్కువగా ఖాళీ చేసి వివిధ జిల్లాల్లోని తమ సొంత గ్రామాలకు వెళ్తారు. గాజువాకలోని భానోజీతోట, ఎల్‌బీఎస్ నగర్, దశమికొండ, శ్రీనగర్, సుందరయ్య కాలనీ, సింహగిరి కాలనీ, దయాళ్ నగర్, పైడిమాంబ కాలనీ, పెంటయ్య నగర్, కృష్ణానగర్, గణేష్‌నగర్, బొజ్జన్నకొండతో పాటు అప్పన్న కాలనీల్లో సుమారు సుమారు 20వేల కుటుంబాలు స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నాయి. ఉపాధి కోసం ఇక్కడికి వలస వచ్చిన ఈ కుటుంబాల్లో దాదాపు 70 శాతం కుటుంబాలు పండక్కి వెళ్తాయి. గాజువాకలోని పండగ షాపింగ్ పూర్తి చేసుకొని భోగి రోజు బయల్దేరతారు. వారం రోజులపాటు తమ సొంత గ్రామాల్లో గడిపి తిరిగి వచ్చేందుకు వారంతా సన్నద్ధమవుతున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

76వ వార్డులో రూ.63 లక్షలతో రోడ్లు, కాల్వల నిర్మాణం



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, సమన్వయకర్త ఉరుకూటి చందు

పెదగంట్యాడ: నియోజకవర్గంలోని అన్ని వార్డులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 76వ వార్డు బర్మా కాలనీ, బాలచెరువు, స్వతంత్ర నగర్ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వార్డులో రూ.63 లక్షలతో రోడ్లు, కాలువలు నిర్మించనున్నామని చెప్పారు. ఇప్పటికే వార్డుల్లో సమస్యలను పరిష్కరిస్తూ వస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ప్రజల్లో సంతృప్తి ఉందన్నారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు), వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, నాయకులు దొడ్డి రమణ, తాటికొండ జగదీష్, కాకినాడ పెంటారావు, మంత్రి శంకరనారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే 'ఇంటక్' ప్రధాన ఎజెండా



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఇంటక్ జిల్లా అధ్యక్షుడు మంత్రి రాజశేఖర్

అక్కిరెడ్డిపాలెం: కార్మికుల సంక్షేమమే ప్రధాన ఎజెండా అని ఇంటక్ జిల్లా అధ్యక్షుడు మంత్రి రాజశేఖర్ అన్నారు. ఆటోనగర్‌లోని ఏపీఎస్‌ఈబీ కో ఆపరేటివ్ సొసైటీ బిల్డింగ్‌లో శనివారం నిర్వహించిన జిల్లా ఇంటక్ అత్యవసర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తోందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విశాఖ భవిష్యత్తుకు ప్రమాదకరం అన్నారు. కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోవాలన్నారు. అనంతరం ఇంటక్ నూతన క్యాలెండర్‌ను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో భెల్ (హెచ్‌పీవీపీ) ఇంటక్ నాయకుడు ఉరుకూటి బాబూరావు, డాక్‌యార్డు నుంచి బి.చిన్నారావు రెడ్డి, ఎం.కె.కొండబాబు, హెచ్‌పీసీఎల్ నుంచి నర్సింగరావు, షిప్‌యార్డు నుంచి శ్రీరామ్మూర్తి, ఎంఈఎస్ నుంచి షేక్ బాబ్జీ, స్టీల్‌ప్లాంట్ నుంచి నీరుకొండ రామచంద్రరావు, బీఎస్ రాజు, పి.వి.నగేష్, పి.వి.రమణమూర్తి, గంగవరం గోపీ, ఎన్టీపీసీ నుంచి బీమారావు, లెనిన్ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో బయోమెట్రిక్ మెషీన్లు ఏర్పాటు



ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ మెషీన్లు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ లోపల బయో మెట్రిక్ మెషీన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయి. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల అటెండెన్స్ కోసం బయో మెట్రిక్ పద్ధతి ఏర్పాటు చేయాలని యాజమాన్యం రెండేళ్ల క్రితం నిర్ణయించింది. ఇప్పటికే ప్లాంట్ బయట ఉన్న ప్రధాన పరిపాలన భవనం, టౌన్ అడ్మినిస్ట్రేషన్, ఆగ్రో ఫారెస్ట్, ఇంటర్నల్ ఆడిటింగ్, సీఎస్ఆర్ తదితర విభాగాల్లో బయోమెట్రిక్ విధానం అమలు జరుగుతోంది. ఉక్కు మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు ప్లాంట్ లోపల కూడా బయోమెట్రిక్ అమలు చేయడానికి యాజమాన్యం సన్నాహాలు ప్రారంభించింది. ఇందులో భాగంగా దశల వారీగా అమలు చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది. మొదట జనరల్ షిఫ్ట్ మాత్రమే ఉన్న విభాగాల్లో అమలు చేయాలని, తర్వాత సర్వీసు విభాగాలకు, తదుపరి ప్రొడక్షన్ విభాగాల్లో కూడా అమలు చేయనున్నట్టు సమాచారం. ఇప్పటికే 70 మెషీన్లు కొనుగోలు చేయగా మరో 400 మెషీన్లు రానున్నట్టు అధికార వర్గాల సమాచారం. ఇప్పటికే ఈడీ (వర్క్స్) బిల్డింగ్‌లో కొన్ని మెషీన్లు ఏర్పాటు చేయగా, మిగిలిన విభాగాల్లో ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయి. ఈ అంశంపై కార్మిక సంఘాల్లో, కార్మికుల్లో తర్జన భర్జన కొనసాగుతోంది.

శ్రీవారి లడ్డూల విక్రయం

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో (టీటీడీ) రెండో శనివారం లడ్డూ విక్రయాలు కొనసాగాయి. లడ్డూ విక్రయాల కౌంటర్ వద్ద భక్తులు బారులు దీరారు. రూ. 50 లడ్డూలు అందుబాటులో ఉండటంతో భక్తులు వాటిని కొనుగోలు చేశారు.

వైభవంగా శ్నపన తిరుమంజనం

శ్రీవారి శ్రవణ నక్షత్రం సందర్భంగా స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ



బాడీ డౌన్ లాడర్ స్క్రోలింగ్, టైర్ క్రౌలింగ్ ప్రక్రియలపై విద్యార్థులకు శిక్షణ

పెదగంట్యాడ: జీవన నైపుణ్యాలు పెంపొందించుకోవడంతో పాటు అత్యవసర సమయాల్లో ఎలా స్పందించాలనే అంశాలపై హిందుస్థాన్ సౌట్స్ అండ్‌గైడ్స్ విద్యార్థులకు శనివారం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో పాఠశాలకు చెందిన 30మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఫైర్ ఫైటింగ్, బాడీ డౌన్ లాడర్ స్క్రోలింగ్, టైర్ క్రౌలింగ్ ప్రక్రియలపై శిక్షణ ఇచ్చారు. ప్రతికూల పరిస్థితుల్లో, ఆపదలు, విపత్తులు సంభవించినపుడు ఇతరులకు ఎలా సాయం అందించాలనే అంశాలపై తర్ఫీదు ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులతో టెంట్లు వేయించడం, అప్పటికప్పుడు ఆహార పదార్థాలను తయారు చేయడం తదితర అంశాలను వివరించారు. స్కౌట్ మాస్టార్ ప్రశాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యమంతో కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కార్మికుల నిరవధిక ఉద్యమంతో కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వరంగ సంస్థల జోలికి వెళ్లకుండా ఉండేలా తగిన గుణపాఠం నేర్పుతామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే దీక్షలు శనివారం నాటికి 1066వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో సంస్థకు చెందిన ఎస్ఎంఎస్–2 విభాగ కార్మికులు పాల్గొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటు వారికి అప్పగించాలన్న నిర్ణయానికి ఎదురు తిరిగిన కార్మిక వర్గానికి దెబ్బ కొట్టాలని చూస్తోందన్నారు. ఇందుకు అనుగుణంగా స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడానికి దొడ్డి దారిన ఉక్కు యాజమాన్యంతో కలిసి విద్రోహ చర్యలు చేపట్టారని ఆరోపించారు. సంస్థలో ప్రధాన విభాగాలను పాక్షికంగా నిలిపివేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఉక్కు నిర్వాసితులు ఇప్పటికీ శాశ్వత ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉక్కు ఉద్యమ సెగ దేశవ్యాప్తంగా వెళ్లిందన్నారు. దీనికి మద్దతుగా కార్మికులంతా పెద్ద ఎత్తున ఉక్కు ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.


కాంట్రాక్ట్ కార్మికుడికి చందు బాసట



బాధితుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఉరుకూటి చందు

పెదగంట్యాడ: క్షతగాత్రుని కుటుంబానికి వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి చందు బాసటగా నిలిచారు. తీవ్రంగా గాయపడిన కార్మికుడికి ఆర్థిక సాయం అందించారు. 75వ వార్డు కోరాడకు చెందిన ఆర్.అప్పారావు స్టీల్‌ప్లాంట్‌లోని కోక్ అండ్ కోల్ కెమికల్ డిపార్ట్‌మెంట్ బ్యాటరీ–3లో కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్నారు. శనివారం ఉదయం విధులకు వెళ్లిన ఆయన పది మీటర్ల ఎత్తులో పని చేస్తుండగా ప్రమాదవశాత్తు పడిపోయారు. ఆయన వెన్నెముకకు తీవ్ర గాయం కావడంతో పాటు ఒక కాలు విరిగిపోయింది. దీంతో అప్పారావును ఉరుకూటి చందు పరామర్శించారు. రూ.15వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు సోములు, హనుమంత్‌రెడ్డి, ఆదినారాయణ, ఏకే రావు, పైడిరాజు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన



హెల్మెట్ ధరించిన వాహనచోదకుడికి గులాబీ పువ్వు అందిస్తున్న రాంకీ కార్మికుడు

అక్కిరెడ్డిపాలెం: రోడ్డు భద్రతపై రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. షీలానగర్ సిగ్నల్ పాయింట్ వద్ద శనివారం జరిగిన కార్యక్రమానికి గాజువాక లా అండ్ ఆర్డర్ సీఐ ఎల్.భాస్కరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా సిబ్బంది, అధికారులు మాట్లాడుతూ సంక్రాంతి పండగ సందర్భంగా ఊళ్లకు వెళ్లే ప్రయాణికులు రోడ్డు భద్రతను పాటించి, సురక్షితంగా గమ్యస్థానాలకు చేరే విధంగా అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీఐకు వివరించారు. దీనిలో భాగంగా హెల్మెట్ ధరించిన ద్విచక్ర వాహనచోదకులకు, జీబ్రాలైన్లపై ప్రయాణిస్తున్న పాదచారులకు వారు గులాబీపువ్వులు అందజేసి, అభినందించారు. కార్యక్రమంలో గాజువాక ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

కొత్తవలస: కొత్తవలస–పెందుర్తి రైల్వే లైన్‌లో మంగళపాలెం గ్రామ సమీపంలో రైలు కిందపడి తాటిచెట్లపాలెం సమీపంలోని సంజీవయ్య కాలనీకి చెందిన పిట్టా దుర్గాప్రసాద్ (47) శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు క్యాన్సర్‌తో బాధపడుతున్నట్టు తెలిసింది.మంగళపాలెంలో తెలిసిన వారింటికి వచ్చి తిరుగు ప్రయాణంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్టు స్థానికులు తెలిపారు. జీఆర్పీ ఎస్‌ఐ శ్రీనివాసరావు,ఆర్పీఎఫ్ ఎస్‌ఐ రావు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

ఉత్సాహంగా జగనన్న సంక్రాంతి సంబరాలు



వెంపల్లనగర్‌లో విజేతలకు బహుమతులు అందిస్తున్న ఉరుకూటి చందు, కార్పొరేటర్ వంశీరెడ్డి



నాతయ్యపాలెంలో ముగ్గులను పరిశీలిస్తున్న ఉరుకూటి చందు, బోగాది

పెదగంట్యాడ: పండగలు సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకలని వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు) అన్నారు. జగనన్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఉరుకూటి చందు ఆధ్వర్యంలో 74వ వార్డు వెంపల్లనగర్ కమ్యూనిటీ హాల్ వద్ద శనివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగ అనగానే వారం రోజుల నుంచి పండగ వాతావరణం నెలకుంటుందన్నారు. భారతీయ కళలు, సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని, భావి తరాలకు వాటిని తెలియజేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అనంతరం ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

76వ వార్డులో..

జీవీఎంసీ 76వ వార్డులో వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు దొడ్డి రమణ, ప్రమీల, జగదీష్, కాకినాడ పెంటారావు, మంత్రి శంకరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

69వ వార్డులో..

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెం బంగారుమాంబ అమ్మవారి ఆలయం వద్ద మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు ఆధ్వర్యంలో శనివారం జరిగిన పోటీలకు ముఖ్య అతిథిగా గాజువాక సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు) హాజరయ్యారు. 50 మంది మహిళలు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు ఉరుకూటి చందు, బోగాది సన్యాసిరావు బహుమతులను అందజేశారు.

తండ్రి అస్థికలు కలిపి వస్తూ అనంత లోకాలకు..

- తాళ్లపాలెం వద్ద రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి
- నలుగురికి తీవ్రగాయాలు



మృతుడు భాస్కరరావు



తాళ్లపాలెం వద్ద బోల్తా పడిన కారు

కొంకోట: మండలంలోని తాళ్లపాలెం వద్ద కారు బోల్తా పడి ఒకరు మృతి చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. గోదావరి నదిలో అస్థికలు కలిపి తిరిగి ఇంటికి వస్తుండగా శనివారం ప్రమాదం జరిగింది. సీఐ ఆనంద బాబు అందించిన వివరాల ప్రకారం.. పరవాడ మండలం అగనంపూడికి చెందిన ఈతపల్లి నారాయణరావు ఇటీవల మృతి చెందారు. దీంతో సంప్రదాయంగా ఆయన అస్థికలు గోదావరిలో కలపడానికి ఆయన కుమారులు ఈతపల్లి భాస్కరరావు(28), వాసుదేవరావు బంధువులతో కలిసి రాజమహేంద్రవరం వెళ్లారు. అక్కడ గోదావరి నదిలో అస్థికలు కలిపిన అనంతరం కారులో అగనంపూడి ఇంటికి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో తాళ్లపాలెం వద్ద జాతీయ రహదారి వంతెన సమీపంలోకి వచ్చేసరికి రోడ్డు పక్కన రక్షణగా వేసిన రెయిలింగ్ స్తంభాన్ని ఢీకొట్టి పక్కనున్న పొలాల వైపు బోల్తా పడి పల్టీ కొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న భాస్కరరావు(28), వాసుదేవరావు, బంధువులు ఈతపల్లి గణేష్, మురళీగణేష్, రెడ్డిబోయిన వెంకటరావు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని జాతీయ రహదారి వాహనంలో అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ భాస్కరరావు మృతి చెందారు. మిగిలిన వారు చికిత్స పొందుతున్నారు. మృతుడు భాస్కరరావు పరవాడ ఫార్మాసిటీలోని ప్రైవేటు పరిశ్రమలో పని చేస్తున్నాడు. అతని మృతితో కుటుంబం విషాదంలో మునిగిపోయింది.